సాక్షి
నంద్యాల
సోమవారం। 2। సెప్టెంబర్। 2024



వైభవంగా గూటుపల్లె ఉరుసు

గూటుపల్లె గ్రామంలో హజరత్ సయ్యద్ షా అబ్దుల్ రహమాన్ ఇద్రూస్ బాషా (పెద్ద రాజు స్వామి) ఉరుసు వైభవంగా జరిగింది. భక్తులు స్వామికి గంధం తోపాటు ఫాతేహాలు సమర్పించారు. 10లో▸



నీటి విడుదల తగ్గింపు

పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి విడుదలను తగ్గించారు. భారీ వర్షాల నేపథ్యంలో పంట కాల్వల్లోకి వరద నీరు చేరి పొలాలను ముంచెత్తకుండా చర్యలు తీసుకున్నారు. 10లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,631.52
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	: 98.324
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 40,107
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	:13,475

న్యూస్‌రీల్

నేడు పాఠశాలలకు సెలవు

నంద్యాల(న్యూటౌన్): రెండు రోజులుగా జిల్లాలో ఎడతెరపి లేని వర్షాల కారణంగా సోమవారం పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాగులు, వంకలు పొంగి పొర్లడంతో విద్యార్థుల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సెలవు ప్రకటించామన్నారు. పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పురుగు మందుల అమ్మకాలు నిలుపుదల



పట్టుబడిన నిషేధిత పురుగుల మందులు

వెలుగోడు: పట్టణంలోని జువారి హబ్ లిమిటెడ్ జై కిసాన్ ఎరువుల దుకాణంలో కాలం చెల్లిన పురుగుమందులను గుర్తించి అమ్మకాలను నిలిపివేసినట్లు ఏవో పవన్ కుమార్ తెలిపారు. ఆదివారం దుఖానాన్ని తనిఖీ చేసి వీటిని గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ యూనివర్సల్ అగ్రో కెమికల్ ఇండస్ట్రీస్ వారి కాల పరిమితి అయిపోయిన 1150 కేజీలు స్టాకును అమ్మకాలు నిలపుదల చేశామన్నారు. వీటి విలువ 11. 45 లక్షలు ఉంటుందన్నారు. రైతులు యూనివర్సల్ అగ్రి కెమికల్ ఇండస్ట్రీస్ కంపెనీ వారి పురుగు మందులు ఏ దుకాణంలో కూడా కొనుగోలు చేయకూడదని రైతులకు సూచించారు. ఆ కంపెనీ ఉత్పత్తులను నిషేధించడం జరిగిందని తెలిపారు. ఆయన వెంట సిబ్బంది రామకృష్ణ, వెంకట శివ ఉన్నారు.

అతిసారం బారిన మరో ఐదుగురు



వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్న చిన్నారి

పాములపాడు: వేంపెంట గ్రామంలో మరో ఐదుగురు అతిసార వ్యాధి బారిన పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గత నెల 29వ తేదీ గ్రామంలో అతిసార ప్రబలడంతో ఇప్పటి వరకు 26 కేసులు నమోదయ్యాయి. ఒక వృద్ధురాలు మృతి చెందగా, పలువురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటున్నారు. ఆదివారం ఐదు కొత్త కేసులు వెలుగు చూడగా, నలుగురిని ఆత్మకూరు ఆసుపత్రికి తరలించారు. మరో చిన్నారికి గ్రామంలోని వైద్య శిబిరంలో చికిత్స అందిస్తున్నారు. అతిసారను అదుపు చేసేందుకు చర్యలు చేపట్టామని, బాధితులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే చేస్తున్నట్లు డాక్టర్ నాగలక్ష్మి తెలిపారు. గ్రామంలో శుద్ధి జలాన్ని సరఫరా చేస్తున్నట్లు ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. చెంచు గిరిజన కాలనీలోకి వర్షపు నీరు చేరడంతో జేసీబీ సాయంతో సర్పంచు మాణిక్యమ్మ ఆధ్వర్యంలో తొలగించారు.

మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



భ్రమరాంబాదేవి అమ్మవారి దర్శనానికి వెళ్తున్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనంతో పాటు శ్రీశైలం డ్యాం 10క్రస్ట్‌గేట్లను తెరవడంతో కృష్ణమ్మ అందాలను కనులారా చూసేందుకు భక్తులు, యాత్రికులు వేలాదిగా తరలివస్తున్నారు. వేకువజామునే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. శ్రీశైలంలో భారీ వర్షం కురుస్తుండడంతో దర్శనం అనంతరం భక్తులు తమ వసతి గదులకే పరిమితమయ్యారు.

నేడు ఈరన్న స్వామి పల్లకోత్సవం

కౌతాళం: శ్రావణమాస చివరి సోమవారం ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. సోమవారం తెల్లవారుజామున స్వామి వారి పల్లకోత్సవం కోసిగి మండలంలోని కందుకూరు వద్ద తుంగభద్ర వద్దకు చేరుకుటుంది. ఉత్సవం సాయంత్రం ఉరుకుందకు తిరిగి వస్తుంది. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు.



శివభాష్యం సాగర్ నుంచి విడుదలవుతున్న నీరు



కర్నూలు – గుంటూరు ఘాట్ రోడ్డును మూసి వేయడంతో నిలిచిన ఆర్టీసీ బస్సులు



ఆత్మకూరు – కొత్తపల్లె మార్గంలో వంతెనపై ప్రవహిస్తున్న భవనాశి వాగు

- జిల్లా అంతటా భారీ వర్షం
- శ్రీశైలంలో అత్యధికంగా 116.6 మి.మీ
- ఉప్పొంగిన వాగులు, వంకలు
- దోర్నాల ఘాట్ రోడ్డు మూసివేత
- గిద్దలూరు ఘాట్ మీదుగా భారీ వాహనాల మళ్లింపు
- దాదాపు 15 వేల హెక్టార్లలో పంట నష్టం



కొత్తపల్లి మండలం గోకవరం సమీపంలో నీటమునిగిన కంది పంట

వర్ష బీభత్సం

నంద్యాల(అర్బన్): రెండు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలతో జిల్లా అతలాకుతలమైంది. భారీ వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. వాగులు, వంకలు ఉప్పొంగి నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పంట చేలను వరద నీరు ముంచెత్తింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు జిల్లాలో భారీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా శ్రీశైలంలో 116.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అత్యల్పంగా అవుకు మండలంలో 5.6 మి.మీ వర్ష పాతం నమోదైంది. ఏక ధాటిగా కురుస్తున్న వర్షాలతో వంకలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. వరద నీటి ఉధృతిని దృష్టిలో ఉంచుకుని పలు వాగుల వద్ద పోలీసులు పహారా ఉన్నారు. మరో వైపు ఆత్మకూరు వద్ద దోర్నాల ఘాట్ రోడ్డును ఆదివారం ఉదయం నుంచి మూసివేశారు. సాయంత్రం తర్వాత శ్రీశైలానికి బస్సులను అనుమతించారు. భారీ వాహనాలను నంద్యాల, గిద్దలూరు ఘాట్ మీదుగా మళ్లించారు. జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దాదాపు 15 వేల హెక్టార్ల పంట నీట మునిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేసినట్లు సమాచారం. మొక్కజొన్న, మినుము, వరి, సోయాబీన్స్, మిరప తదితర పంటలు నీటమునగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

➤ నంద్యాల పట్టణంలోని కుందూ, మద్దిలేరు వాగులు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మద్దిలేరు వాగు మీదుగా భీమవరం, 1వ వార్డు పీవీనగర్, యత్రగుంట్ల, కరిమద్దెల, పెసరవాయి గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

➤ నందికొట్కూరు నియోజకవర్గంలో శివపురం, లింగాపురం గ్రామాల మధ్య ఉన్న ఎద్దులేరు వాగు, లింగాపురం, కొత్తమడుగుల గ్రామాల మధ్య ఉన్న నల్లవాగు పొంగి ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

➤ పాములపాడులో చెలిమిల్ల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై నీళ్లు ప్రవహిస్తున్నాయి. ఎన్నడూలేని విధంగా కంబాలపల్లి గ్రామ సమీపంలోని ఎస్ఆర్ఎంసీ కాలువపై ఉన్న సూపర్ ప్యాజేజ్ వంతెన పైకి భవనాశి వాగు నుంచి నీరు చేరింది.

➤ పగిడ్యాల మండలంలో శ్రీశైలం బ్యాక్‌వాటర్ పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు దండోరా వేయించారు.

➤ ఆత్మకూరు మండలంలోని దుద్యాల, ఆత్మకూరు మధ్య ఉన్న కుమ్మరికుంట వాగు నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు ఇబ్బందుల పడ్డారు. సుద్దవాగు గుండ్లకమ్మ వాగుల నీరు ఆత్మకూరు పట్టణ శివారు కాలనీలు జలమయమయ్యాయి. దీంతో ప్రజలు అవస్థలు పడ్డారు.

➤ నల్లమలలోని శివభాష్యం సాగర్‌కు వరద పోటెత్తడంతో అధికారులు ప్రాజెక్ట్‌కు ఉన్న నాలుగు గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు

➤ కోవెలకుంట్ల– లింగాల ఆర్అండ్‌బీ రహదారిలో శనివారం నుంచి రాకపోకలు స్తంభించిపోయాయి. ఆయా వాగుల పరివాహక ప్రాంతాల్లో వరి, మొక్కజొన్న, తదితర పంటలు నీట మునిగి నష్టం వాటిల్లింది.

లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయండి..

జిల్లాలలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం పట్టణ శివారులోని పీవీ నగర్, భీమవరం రహదారిలోని మద్దిలేరు వాగు బ్రిడ్జిపై వరదనీటి ఉధృతిని కలెక్టర్ పరిశీలించారు. వరద ఉధృతంగా ఉన్న సందర్భంగా సంబంధిత గ్రామాల ప్రజల ప్రయాణ రాకపోకలను అనుమతించవద్దని మున్సిపల్, పోలీసు అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, తహసీల్దార్ ప్రియదర్శిని తదితరులు ఉన్నారు.



నంద్యాలలో మద్దిలేరు వాగును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి, అధికారులు



మండల కేంద్రం మిడుతూరులో జోరుగా కురుస్తున్న వాన



ఆత్మకూరు పట్టణం ఏకలవ్యనగర్‌లో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు



శ్రీశైలం సమీపంలో ఘాట్ రోడ్డుపై కొండ చరియలు విరిగిపడిన దృశ్యం

జిల్లాలో వర్షపాతం వివరాలు

మండలం పేరు	వర్షపాతం (మి.మీ)
కొత్తపల్లె	94.2
నందికొట్కూరు	88.8
జూపాడు బంగ్లా	87.6
ఆత్మకూరు	86.6
పగిడాల	80.0
పాములపాడు	76.6
వెలుగోడు	72.2
మిడుతూరు	61.0
గడివేముల	46.4
బండిఆత్మకూరు	33.6
మహానంది	28.8
నంద్యాల	22.8
దొర్నిపాడు	22.8
సంజామల	17.4
బేతంచెర్ల	12.8
రుద్రవరం	12.8
గోస్పాడు	12.4
పాణ్యం	11.6
ప్యాపిలి	11.6
శిరివెళ్ల	11.2
ఆళ్లగడ్డ	11.0
డోన్	10.2
చాగలమర్రి	9.4
కోవెలకుంట్ల	8.6
బనగానపల్లె	8.2
ఉయ్యాలవాడ	7.6
కొలిమిగుండ్ల	7.2

వర్షాలు తగ్గే వరకు భక్తులకు ఉచిత వసతి

- ఈఓ పెద్దిరాజు



సమీక్షా వివరాలను వెల్లడిస్తున్న ఈఓ డి.పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనార్థం శ్రీశైలం వచ్చిన భక్తులకు వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు దేవస్థానం ఉచిత వసతి సదుపాయం కల్పిస్తుందని ఈఓ డి.పెద్దిరాజు తెలిపారు. క్షేత్ర పరిధిలో ఉన్న యాత్రికులకు దేవస్థానం డార్మెటరీ, టూరిస్ట్ బస్టాండ్ సమీపంలోని డార్మెటరీలలో, హటకేశ్వరం వద్ద ఉన్న యాత్రికుల సౌకర్య కేంద్రం వద్ద కూడా భక్తులకు ఉచిత వసతి సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. శ్రీశైలంలో భారీ వర్షాల నేపథ్యంలో అధికారులతో ఈఓ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా క్షేత్ర పరిధిలో ఇళ్లలోకి నీరు చేరుకోవడంతో వంట చేసుకునే అవకాశం లేనివారికి దేవస్థానం అన్నప్రసాద వితరణ కేంద్రంలో భోజన సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆ విభాగం అధికారులను ఆదేశించారు. దేవస్థానంలోని అన్ని విభాగాల అధికారులు కూడా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమీక్షలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారి రమణ మ్మ, ప్రధానార్చకులు వీరయ్యస్వామి, వేదపండితులు గంటి రాధాకృష్ణ, ఈఈ రామకృష్ణ, మురళీధర్‌రెడ్డి, ఏఈవో హరిదాసు, స్వాములు, పలువురు పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ప్రత్యేక కంట్రోల్ రూం

వర్షాల వలన దేవస్థానం పరిధిలో సహాయ చర్యలు చేపట్టేందుకు, అవాంఛనీయ సంఘటనలు నిరోధించేందుకు అన్నప్రసాద వితరణ భవనం ప్రాంగణంలో శనివారం రాత్రి నుంచి కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టేంత వరకు ఈ కంట్రోల్ రూం నిరంతరం పనిచేస్తుంది. స్థానికులు, భక్తులు అత్యవసర సమయాలలో సంప్రదించేందుకు ప్రత్యేకంగా 08524–293015 ఏర్పాటు చేశారు.

కుందూ పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



తెళ్లపురి వద్ద కుందూ తీరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్‌రాణా

గోస్పాడు: కుందూనది పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణ అన్నా రు. ఆదివారం రాత్రి ఆయన నది పరివాహక గ్రామమైన తెళ్లపురిని సందర్శించారు. నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో తెళ్లపురి, రాయపాడు, ఎస్.కూలూరు వాసులు కుందూ వైపు వెళ్లరాదని సూచించారు. నది పరిసర ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్ఐ వెంకటప్రసాద్‌ను ఆదేశించారు.

నేడు వినతుల స్వీకరణ

నంద్యాల (అర్బన్): కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రాజకుమారి ఆదివారం తెలిపారు. అర్జీలను పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలన్నారు.

ఉద్యోగం ఉంటుందా.. ఊడుతుందా!

- అక్టోబర్ 1 నుంచి నూతన మద్యం పాలసీ
- ఆందోళనలో సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు, వాచ్‌మెన్లు
- ఇప్పటికే రెండు నెలలుగా అందని వేతనాలు

బొమ్మలసత్రం: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న సిబ్బంది ఉద్యోగాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. మూడు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త మద్యం పాలసీని ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం చేస్తోంది. అక్టోబర్ 1వ తేదీ నుంచి అమలు చేసే దిశగా ఏర్పాట్లు చేస్తుండటంతో ప్రస్తుతం ఆయా దుకాణాల్లో పని చేసే సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు, వాచ్‌మెన్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది. నూతన మద్యం పాలసీ విధానంలో ప్రస్తుతం పని చేస్తున్న సిబ్బందిని కొనసాగిస్తారా.. తొలగిస్తారా అనే ఆందోళన వారిని వెంటాడుతోంది. ప్రతి నెల నాలుగో తేదీనే వీరికి అందే జీతాలు గత రెండు నెలలుగా ఇవ్వడం లేదు. దీంతో వారిని తొలగించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లుగా సంకేతాలు వెలువడుతున్నాయి. నంద్యాల జిల్లాలో 93 ప్రభుత్వ మద్యం దుకాణాలు కొనసాగుతున్నాయి. వీటిలో నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, ఆత్మకూరు, నందికొట్కూరు, డోన్‌లాంటి పట్టణాల్లో మొత్తం 26 దుకాణాలు ఉన్నాయి. వీటిలో ఒక్కో దుకాణానికి ఓ సూపర్‌వైజర్, ముగ్గురు సేల్స్‌మన్లు, ఇద్దరు వాచ్‌మెన్లు పనిచేస్తున్నారు. మండల ప్రాంతాల్లో ఉన్న మద్యం దుకాణాల్లో ఒక సూపర్‌వైజర్, ఇద్దరు సేల్స్‌మెన్, ఒక వాచ్‌మెన్ పనిచేస్తున్నారు. మొత్తం కలిపి దాదాపుగా 500 మంది ఉద్యోగులు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కొనసాగుతున్నారు. వీరిలో సూపర్‌వైజర్‌కు రూ. 19,500, సేల్స్‌మెన్‌కు రూ. 16,500, వాచ్‌మెన్‌కు రూ. 10 వేలు జీతం ఇస్తున్నారు. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వం మద్యం దుకాణాల నిర్వాహణకు ప్రతి రెండేళ్లకొకసారి టెండర్లు పిలిచేవారు. లాటరీ పద్ధతిలో దుకాణాలు కేటాయించే వారు. జిల్లాలో కొన్ని మద్యం దుకాణాలు అన్నిటికంటే ఆదాయం ఎక్కువగా వచ్చేవాటిని అప్పటి నేతలు తమ ఆధీనంలో ఉంచుకుని నిర్వహించుకునే వారు. మద్యం దుకాణాల్లో ఎక్కడ చూసిన దోపిడీ కొనసాగుతుండగా 2019 తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే మద్యం దుకాణాలను నడిపించింది. మద్యం దుకాణాల్లో కొనసాగుతున్న అవినీతికి చెక్ పెట్టడమే కాకుండా బెల్టు షాపులను కూడా తొలగించింది. ఇదే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించింది. ఐదేళ్ల పాటు కొనసాగిన ఉద్యోగులు నేడు కూటమి ప్రభుత్వం రాగానే ఆందోళనకు లోనవుతున్నారు. నూతన మద్యం పాలసీతో తమ ఉద్యోగాలు కొనసాగుతాయా లేక ఊడుతాయా సందిగ్ధం వారిలో నెలకొంది.



సాయిబాబానగర్‌లోని మద్యం దుకాణం

టీడీపీ నేతల దుకాణాలు..

టీడీపీ ప్రభుత్వం తమ పార్టీ నేతల జేబులు నింపేందుకే కొత్త మద్యం పాలసీని ప్రవేశపెడుతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ పేరుతో ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించనుంది. దీనికి సంబంధించి టెండర్ల ప్రక్రియను కొనసాగిస్తారు. దీని ద్వారా లబ్ధిపొందేది బడా కాంట్రాక్టర్లు, టీడీపీ నేతలేనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టీడీపీ నేతలు కొందరు అక్రమంగా మద్యం దుకాణాలు నిర్వహించేందుకు ఇప్పటికే ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తుంది. పల్లెల్లో ఇప్పుడు కనిపించని బెల్ట్‌షాపులు మళ్లీ తెరుచుకోనున్నాయి. ఈ దశలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే ఉద్యోగుల గురించి ప్రభుత్వం ఒక్క ప్రకటన కూడా చేయకపోవటం గమనార్హం. వారిని ఉద్యోగాల్లో కొనసాగించే ఆలోచన ప్రభుత్వానికి లేనట్టుగా అర్థమవుతుంది. ఇదే జరిగితే వారంతా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన బాట పట్టనున్నారు.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి

నంద్యాల (న్యూటౌన్): సీపీఎస్, జీపీఎస్ విధానాలను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఏపీటీఎఫ్ 1938 సభ్యులు ఆదివారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర సభ్యులు సాంబశివుడు, నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాధవస్వామి, నగరి శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగుల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయన్నారు. నంద్యాల జిల్లా పీఈటీ అసోషియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల రవికుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎంపీలకు పెన్షన్ సౌకర్యం ఉన్నప్పుడు సుదీర్ఘకాలం సర్వీసు చేసే ఉద్యోగులకు పెన్షన్ లేకపోవడం బాధాకరం అన్నారు. ఉద్యోగులకు పెన్షన్ లేనప్పుడు ప్రజాప్రతినిదులకు కూడా పెన్షన్ ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని కోరారు. నిరసనలో సంఘం నేతలు ఈశ్వరరెడ్డి, రవితేజ, పుల్లయ్య, లింగమయ్య, పవన్‌కుమార్, జయరాం, విజయకుమార్, రమేష్ పాల్గొన్నారు.



కలెక్టర్‌రేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగ సంఘాల నాయికులు

క్లుప్తంగా

కృత్రిమ అవయవాల పంపిణీ



దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందజేస్తున్న బీవీపీ సభ్యులు

కర్నూలు కల్చరల్: భారత్ వికాస్ పరిషత్ తుంగభద్ర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు లక్ష్మీపురం ఆనంద్ కుమార్ మాట్లాడుతూ..అభాగ్యులకు అండగా నిలవడం ప్రశంసనీయమన్నారు. బీవీపీ తిరుపతి ప్రాంత సేవా ప్రముఖ్ రేగూరు బాలకృష్ణ మాట్లాడుతూ.. 100 మంది దివ్యాంగులకు రూ.10 లక్షల విలువ చేసే కృత్రిమ అవయవాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో బీవీపీ తుంగభద్ర శాఖ అధ్యక్షులు లక్ష్మణస్వామి, తిరుపతి ప్రాంత అధ్యక్షులు బీవీ బాలసుబ్రహ్మణ్యం, బీవీపీ సభ్యులు రఘు, పెరుమాళ్ల దత్తయ్య, మురళీకృష్ణ, సతీష్, దాతలు పాల్గొన్నారు.

శ్రీమఠానికి రూ.2 లక్షల విరాళం

మంత్రాలయం: శ్రీరాఘవేంద్ర స్వామి మఠానికి ఓ భక్తుడు రూ.2 లక్షలు విరాళంగా అందజేసినట్లు మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం రాజమండ్రికి చెందిన జాగిదార్ భీమసేన విరాళాన్ని మేనేజర్‌కు అప్పగించారు. శ్రీమఠం ఆధ్వర్యంలో జరుగు అన్నదానానికి ఈ విరాళాన్ని ఇచ్చినట్లు వివరించారు. దాతకు శ్రీమఠం తరపున శేషవస్త్రం, రాఘవేంద్రుల జ్ఞాపిక, ఫల పూల మంత్రాక్షితలు అందజేశారు.

శతాధిక వృద్ధురాలి మృతి



వృద్ధురాలు సంగిరెడ్డి పెద్ద లక్ష్మమ్మ

శిరివెళ్ల: చెన్నూరు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు సంగిరెడ్డి పెద్ద లక్ష్మమ్మ (105) ఆదివారం మరణించారు. ఇప్పటి వరకు బీపీ, షుగర్ వంటి జబ్బులు లేకుండా స్వతహాగా ఇంటిలో తిరుగుతున్న వృద్ధురాలు మూడు రోజుల నుంచి కొంత ఆయాసంతో ఇబ్బంది పడుతూ మంచం పట్టి మృతి చెందింది. వృద్ధురాలికి ముగ్గురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. మునిమళ్లు కూడా పెండ్లీడుకు వచ్చారు. కాగా వృద్ధురాలి మృతి పట్ల సర్పంచు చిట్టిబాబు, ఎంపీటీసీ సులోచన, వైఎస్సార్‌సీపీ నాయకులు మేర్వ నాగభూషణంరెడ్డి, కుల్లాయ్‌రెడ్డి, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

త్వరలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్లు




మాట్లాడుతున్న సురేష్

కర్నూలు (టౌన్): త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బాస్కెట్‌బాల్ అసోసియేషన్లు ఏర్పాటు చేస్తామని ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర పరిశీలకులు సురేష్ తెలిపారు. కర్నూలు స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఆదివారం బాస్కెట్‌బాల్ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్తగా జాతీయ స్థాయిలోనూ అండర్-23 మహిళలు, పురుషుల విభాగంలో బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

మదిమదిలో.. జన హృదిలో

- చెరగని మహానేత జ్ఞాపకాలు
- దేశానికే ఆదర్శంగా నిలిచిన వైఎస్సార్ పథకాలు
- ఉచిత విద్యుత్‌తో రైతన్నకు అండ
- ఆరోగ్య శ్రీతో పేదల గుండెకు భరోసా
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు
- నేడు దివంగత నేత వైఎస్సార్ వర్ధంతి
- ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు



కర్నూలు (టౌన్)/(అగ్రికల్చర్)/నంద్యాల (రూరల్): దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రగతి సాధకుడు.. సంక్షేమరథసారథి. ఆయన పాలనలో అభివృద్ధి పరుగులు పెట్టింది. పాలన అంటే ఎలా ఉండాలో మహానేత చూపించారు. దేశంలోని అనేక రాష్ట్రాలు నివ్వెరపోయే విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారు. ఆ పథకాలను రద్దు చేసేందుకు ఏ ప్రభుత్వం సాహసించ లేదంటే అతిశయోక్తి కాదు. ఆరోగ్య శ్రీతో పేదలకు కార్పొరేట్ వైద్యం అందింది. ఉచిత విద్యుత్, ఫీజురీయింబర్స్‌మెంట్ ఇలా అనేక పథకాలు బహుళ ప్రజాదరణ పొందాయి. కొత్తగా వచ్చిన ప్రభుత్వాలు వాటికి పేర్లు మార్చుకొని అమలు చేస్తున్నాయి. వైఎస్సార్ పాలన నేటికీ ఆదర్శమే. నేడు(సోమవారం) దివంగత నేత వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం..

ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఎన్నో వరాలు..

డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2004 నుంచి 2009 వరకు ముఖ్యమంత్రి హోదాలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 29 సార్లు పర్యటించారు. అనేక అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.2,800 కోట్లతో హంద్రీ-నీవా సుజల స్రవంతిని పూర్తి చేశారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగులేటర్ సామర్థ్యాన్ని 13 వేల క్యూసెక్కుల నుంచి 44 వేల క్యూసెక్కులకు పెంచారు. సిద్ధాపురం, ముచ్చుమర్రి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఎస్ఆర్‌బీసీ, గాలేరు నగరి ఎత్తిపోతల పథకాలను చేపట్టారు. ముచ్చుమర్రిఎత్తి పోతల పథకాన్ని చేపట్టి కృష్ణా, తుంగభద్ర నదుల అనుసంధానానికి చర్యలు తీసుకున్నారు.

➤ గతంలో ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా అరకొరగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి చేతులు దులుపుకున్నాయి. అయితే మహానేత గూడు లేని ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చాలన్న మంచి ఆలోచనతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొదటి విడతలో 1.22 లక్షల ఇళ్లకు రూ. 360 కోట్లు, రెండో విడతలో రూ. 1.21 లక్షల ఇళ్లకు రూ.404 కోట్లు ఖర్చు చేశారు. పట్టణాల్లోని 3,600 మంది పేదలకు సైతం అపార్టుమెంట్లతో గృహ వసతి కల్పించారు. మూడవ విడతలో 61,143 మంది పేదలకు రూ. 249 కోట్లు ఖర్చు చేసి ఇళ్లు నిర్మించారు.

➤ కర్నూలులో రాయలసీమ యూనివర్సిటీ ఏర్పాటుతోపాటు పదుల సంఖ్యలో బీటెక్, బీఈడీ, డీఈడీ కళాశాలల స్థాపనకు అనుమతులు ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్య సించాలనే ఆకాంక్షతో ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టారు.

➤ వైఎస్సార్ హయాంలోనే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యరూపం దాల్చింది. ఉపాధి నిధులతో డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద పండ్లతోటల సాగును ప్రోత్సహించారు. ప్రతి కుటుంబానికి అంతో.. ఇంతో స్థిరాస్తి ఉండాలనే లక్ష్యంతో భూ పంపిణీ పేరుతో ప్రభుత్వ భూములను సాగు నిమిత్తం పంపిణీ చేశారు. ఆరు విడతలుగా భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వ భూమిని పంపిణీ చేశారు. డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద దాదాపు 8,000 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధిచేశారు. సూక్ష్మసేద్యం అమలుకు ప్రత్యేకంగా ఏపీఎంఐపీని ఏర్పాటు చేశారు.

నేడు సేవా కార్యక్రమాలు..

వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైఎస్సార్‌సీపీ అధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్‌కు నివాళి అర్పించడంతోపాటు అన్నదానం, రక్తదానం శిబిరాలను నిర్వంచనున్నారు. ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు, పాలు, బెడ్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. నంద్యాల జిల్లా పార్టీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించనున్నారు. కర్నూలులోని వైఎస్సార్‌సర్కిల్‌లో ఉన్న మహానేత విగ్రహానికి నివాళులర్పిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షురాలు సిద్రా సత్యనారాయణమ్మ తెలిపారు. కర్నూలు మేయర్ బీవై రామయ్య, కర్నూలు పార్లమెంటు డిప్యూటీ రీజినల్ కో ఆర్డినేటర్ ఎస్వీ మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇంతియాజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొననున్నారు. కల్లూరులోని శరీన్ నగర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించనున్నారు. పార్టీ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొననున్నారు.

రైతుల కల్పతరువు అవుకు



అవుకు రిజర్వాయర్

కోవెలకుంట్ల: రాయలసీమ జిల్లాలను సస్యశ్యామలం చేయాలన్నది దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సంకల్పం. ఇందుకోసం జలయజ్ఞం పేరుతో రెండు టీఎంసీల సామర్థ్యం ఉన్న అవుకు రిజర్వాయర్‌ను నాలుగు టీఎంసీలకు పెంచారు. రిజర్వాయర్‌కు అనుసంధానంగా గాలేరు -నగరి కాల్వ నుంచి వైఎస్సార్, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో 2.67లక్షల ఎకరాలకు సాగునీరు, 640 గ్రామాల్లో 20 లక్షల మందికి తాగునీరు అందించాలన్నది లక్ష్యం. శ్రీశైలం జలాశయం నుంచి అవుకు రిజర్వాయర్‌లోకి నీరు చేరేందుకు 30వ ప్యాకేజీ కింద రూ. 401కోట్లతో 12కి లోమీటర్ల మేర రెండు సొరంగమార్గాలను ఏర్పాటు చేసి వీటి ద్వారా 20వేల క్యూసెక్కుల వరద జలాలను రిజర్వాయర్‌లో నింపాల్సి ఉంది. 2010 నాటికే ఒక సొరంగం గుండా వైఎస్ఆర్ జిల్లా గండికోటకు నీటిని విడుదల చేయించారు.



వైఎస్సార్ మృతి చెందిన ప్రాంతంలో చెల్లాచెదురుగా పడిన హెలికాప్టర్ శకలాలు(ఫైల్)

ఆరోజు ఏం జరిగిందంటే...

ఆత్మకూరు: సరిగ్గా 15 ఏళ్ల క్రితం... 2009 సెప్టెంబర్ 2వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రయాణిస్తున్న హెలికాప్టర్ మిస్సయ్యిందన్న వార్త విన్న ప్రజలు తలా ఒక దిక్కుకు పయనమయ్యారు. తెలిసిన చోటల్లా వెదికారు. నల్లమల అడవిని జల్లెడ పట్టారు. చిత్తూరు జిల్లా అనువల్లి గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించేందుకు అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బేగంపేట విమానాశ్రయం నుంచి 2009 సెప్టెంబర్ 2వ తేదీ ఉదయం బయలుదేరారు. అయితే కొద్దిగంటలకే హెలికాప్టర్ సిగ్నల్స్ అందలేదు. వెంటనే ప్రభుత్వ యంత్రాంగం హెలికాప్టర్ ఆచూకీ కోసం ఐఏఎఫ్, ఆర్మీ, సీఆర్ పీఎఫ్ బలగాలను అప్పట్లో రంగంలోకి దింపింది. హెలికాప్టర్ ప్రస్తుత నంద్యాల జిల్లాలోని ఆత్మకూరు పాములపాడు, కొత్తపల్లి, వెలుగోడు, గడివేముల ప్రాంతాలలో ఎక్కడో ఒక చోట ఉండవచ్చని గాలింపు చర్యలు ప్రారంభించారు. గాలింపు చర్యల్లో భాగంగా కృష్ణానది, నల్లమల సమీపంలో సిగ్నల్స్ ఉన్నట్లు అప్పట్లో గుర్తించడంతో ప్రజలు..అధికారులు గుంపులు గుంపులుగా అరణ్య మార్గం వెంట బయలుదేరారు. ఎక్కడా జాడ కనిపించలేదు. రాత్రంతా నిరీక్షించిన తర్వాత 2009 సెప్టెంబర్ 3వ తేదీ ఉదయం నల్లమలలోని పావురాలగుట్టలో హెలి కాప్టర్ కూలిన ఆనవాళ్లు గుర్తించారు. వైఎస్సార్ మృతి రాష్ట్రంలోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కోట్లాది ప్రజలు దిగ్భ్రాంతికి గురిచేసింది. మహానేత మరణ వార్త విని వేలాది పేద ప్రజల గుండెలు ఆగాయి.

వైభవంగా గూటుపల్లె ఉరుసు



ఫక్కీర్ల గాన కచేరి మధ్య గంధం మహోత్సవం

- భక్తి శ్రద్ధలతో పెద్ద రాజు స్వామి గంధోత్సవం
- తరలివచ్చిన వేలాది మంది భక్తులు
- అబ్బుర పరిచిన ఫక్కీర్ల విన్యాసాలు



శరీర భాగాలపై ఇనుప చువ్వలతో

బేతంచెర్ల: గూటుపల్లె గ్రామంలో వెలసిన చారిత్రక నేపథ్యం ఉన్న హజరత్ సయ్యద్ షా అబ్దుల్ రహమాన్ ఇద్రూస్ బాషా (పెద్ద రాజు స్వామి) ఉరుసు వైభవంగా జరిగింది. దర్గా పీఠాధిపతి గురు సయ్యద్ అక్బర్ బాషా ఖాద్రీ, దర్గా నిర్వాహకులు గురుసయ్యద్ షా బాషా ఖాద్రీ ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున పెద్దరాజు స్వామికి గంధంతోపాటు ఫతేహాలు సమర్పించారు. దర్గా ఆవరణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, కవాలీ పోటీలు ఆకట్టుకున్నాయి. గోవా, ముంబాయి, కర్ణాటక, బెల్గాం, బీజాపూర్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన ఫక్కీర్ల సాహస విన్యాసాలు, కోవెలకుంట్లకు చెందిన ఇనాం దారుల నృత్యం ఆకట్టుకుంది. దర్గా పీఠాధిపతి ఇంటి నుంచి గంధం మహోత్సవం బయలు దేరినప్పుడు భక్త జనసందోహం, మేళతాళాలు, వాయిద్యాల మధ్య ఘన స్వాగతం పలికారు. మతసామరస్యానికి ప్రతీకగా నిర్వహించే ఈ ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో గ్రామం అంతా జన సందోహంగా మారింది. గంధం మహోత్సవం అనంతరం దర్గా పీఠాధిపతిని గ్రామ పురవీధుల్లో గుర్రంపై ఊరేగింపు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. దర్గా నిర్వాహకులతో పాటు పెంచికలపాడుకు చెందిన దాతలు భక్తులకు అన్నదానం చేశారు. సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

రేపు కర్నూలులో జాబ్ మేళా

కర్నూలు సిటీ: నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి పి.దీప్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలులోని బిర్లాగేట్ పోస్టాఫీస్ ఎదురుగా ఉన్న న్యాక్ కేంద్రంలో ఉదయం 9 గంటలకు జాబ్ మేళా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. జాబ్ మేళాలో ఎల్అండ్‌టీ, పేటీఎం, ఎస్బీఐ కార్డ్స్ అమర్ రాజా గ్రూప్, ఆమేజాన్ వేర్ హౌస్ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, పీజీ చదివి 18 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వయస్సు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10 వేల నుంచి రూ. 20 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 8142410410, 9059290821 నంబర్లను సంప్రదించాలన్నారు.

డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో గత నెల 28వ తేదీన జరిగిన డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు వర్సిటీ ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మొదటి సెమిస్టర్ పరీక్షలో 55 మందికి 46, రెండో సెమిస్టర్‌లో 125 మందికి 94, మూడో సెమిస్టర్‌లో 53 మందికి 48, నాలుగవ సెమిస్టర్‌లో 67 మందికి 59, ఐదో సెమిస్టర్‌లో 1012 మందికి 923, ఆరో సెమిస్టర్‌లో 53 మందికి 46 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఆరు సెమిస్టర్లకు 1,365 మంది హాజరు కాగా 1,216 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

పోతులింగేశ్వరుడికి నదీ జలాలతో అభిషేకం



తుంగభద్ర నదిలో పల్లకీని మోసుకొస్తున్న భక్తులు

హొళగుంద: మండలంలోని గజ్జహళ్లి గ్రామంలో వెలసిన పోతు లింగేశ్వరస్వామి వారికి శ్రావణ మాసం చివరి ఆదివారం సందర్భంగా గ్రామస్తులు తుంగభద్ర నదీ జలాలతో అభిషేకం నిర్వహించారు. దాదాపు 30 కిమీ దూరంలో ఉన్న కర్ణాటక రాష్ట్రం శిరుగుప్ప తాలూకా కెంచనగుడ్డ వద్ద ప్రవహించే తుంగభద్రా నదికి వెళ్లి అక్కడున్న 101 శివలింగాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడ నుంచి గంగాజలం నిండిన కుంభాన్ని, పల్లకీని ఊరేగింపుగా కాలినడకన గ్రామానికి తీసుకొచ్చి పోతులింగేశ్వరుడిని అభిషేకించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో భజనాలు, ఇతర పూజలు చేసి అన్నదానం కార్యక్రమం చేపట్టారు.

పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల తగ్గింపు

జూపాడుబంగ్లా: రెండు రోజుల నుంచి ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి విడుదలను తగ్గించినట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 30వేల క్యూసెక్కులుగా ఉన్న నీటి విడుదలను 12వేల క్యూసెక్కులకు తగ్గించినట్లు తెలిపారు. పంట కాల్వలకు వరద నీరు చేరి పొలాలను ముంచెత్తకుండా నీటి విడుదలను తగ్గించామన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద 12వేల క్యూసెక్కుల నీటిని ఎస్సార్‌ఎమ్సీకి విడుదల చేస్తున్నామన్నారు. బానకచర్ల నీటి నియంత్రణ వ్యవస్థ నుంచి కేసీ ఎస్కేప్ కాల్వకు 2వేల క్యూసెక్కులు, జీఎన్ఎస్ఎస్ కాలువకు 10వేల క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకించాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



మాట్లాడుతున్న షేక్ అబ్దుల్ సుభాన్

కర్నూలు(సెంట్రల్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని పార్లమెంట్‌లోని సెక్యులర్ రాజకీయ పార్టీలు వ్యతిరేకించాలని రౌండ్ టేబుల్ చట్టంలో వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం పాతబస్తీలోని ఉర్దూ ఘర్‌లో వక్ఫ్ సవరణ చట్టం పై అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ సుభాన్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. వక్ఫ్ ఆస్తుల్లో ఇతరుల పెత్తనం కోసమే కేంద్రం ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకొస్తోందన్నారు. దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించకూడదన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖాజా హుస్సేన్, మూమెంట్ ఫర్ పీస్ జస్టిస్ రాష్ట్ర నాయకుడు ఖదీర్‌బాషా, ముస్లిం ఐక్య వేదిక నాయకులు జాకీర్ హుస్సేన్, జమాతే ఇస్లాం ఏ హింద్ నాయకులు, వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా షేక్ నసిరుద్దీన్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీల మాటున రాజకీయం!

- బీజేపీ నాయకుడు మధుసూదన్‌శర్మ ఆడియో లీక్...
- సోషల్ మీడియాలో వైరల్



ఆదోని టౌన్: బీజేపీ నేతల కుట్ర బయటపడింది.. కూటమి నేతల్లో లుకలుకలు బయటపడుతున్న నేపథ్యంలో ఫ్లెక్సీల డ్రామా ఆడినట్లు మధుసూదన్‌శర్మ ఆడియో లీక్ ద్వారా వెల్లడైంది. దేవాలయ పూజారిగా మధుసూదన్ శర్మ కొనసాగుతుండగా.. ఆయన భార్య లలితమ్మకు 22వ వార్డు సీటు ఇప్పించి అప్పటి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి గెలిపించారు. అయితే మధుసూదన్‌శర్మ తిన్నింటి వాసాలు లెక్కపెడుతూ.. బీజేపీ నేతల ప్రలోభాలకు గురై ఆ పార్టీలో చేరారు. ఆదోనిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయ నిర్మాణం అక్రమమంటూ పట్టణంలో ఫ్లెక్సీలు వేశామని చెప్పారు.ఈ ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిగింది.. మధుసూదన్ శర్మ ఏమాట్లాడారంటే...

- కూటమిలో కుమ్ములాటలు జరుగుతున్నాయి. ఫ్లెక్సీల ఏర్పాటుతో కూటమిలో జరుగుతున్న కుమ్ములాటలన్నీ మటుమాయమయ్యాయి. ప్రజలంతా వాటి గురించే చర్చించుకుంటున్నారు. మా ఎమ్మెల్యే(పార్థసారథి) మీనాక్షి నాయుడు ఆరోపణల నుంచి తప్పించుకోవచ్చు. ఇప్పుడు టీడీపీ కార్యకర్తలపైన చర్చ లేదు. కొట్లాటలు లేవు. కూటమి ప్రశాంతంగా ఉందని చెప్పుకుంటున్నారు.
- చలానా కట్టకుండా ఫ్లెక్సీలు వేశాం. కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ వాటిని తొలగించలేకపోయారు. కౌన్సిల్‌లో వైఎస్సార్‌సీపీ వారు వాగ్వాదం చేసిన తర్వాత తొలగించారు. రెండో స్టెప్ వేయాలనుకున్నాం. ఫ్లెక్సీలు కట్టిన చోటునే సంతకాల సేకరణ చేస్తాం. ప్రజాకోర్టులో అక్రమమని తేలితే మేం బిల్డింగ్‌ను స్వాధీనం చేసుకుంటాం. సక్రమమంటే దానిపై నోరు ఎత్తం.
- వైఎస్సార్‌సీపీ కార్యాలయం లీజుకు మాత్రమే తీసుకున్నామని, దాని ఓనర్ ఎర్రిస్వామి అని చెబుతున్నారు. అందుకు సంబంధించి అగ్రిమెంట్ లీజు రద్దు చేసుకుని భవనం ఎర్రిస్వామిదని చెబితే పని అయిపోతుంది. ఇక ఎర్రిస్వామిని ఎమ్మెల్యే, మేం చూసుకుంటాం.
- బిల్డింగ్‌కు సంబంధించిన ఓనర్ బాబయ్య, ఆయన కొడుకులు, బంధువులను కలిశాం. అయితే భవనానికి సంబంధించిన రికార్డులన్నీ ఉన్నాయి. పోరాడేందుకు శక్తి లేదు. సాయం చేస్తే కోర్టుకు వెళ్తాం.. భవనాన్ని స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. త్వరలోనే అదే పని జరుగుతుంది.

చదువుల కోవెలలో 'ఒకరికొకరు'

ఏకోపాధ్యాయ పాఠశాలలో ఒకే విద్యార్థిని

- ఈమె కోసం ఓ ఉపాధ్యాయురాలు
- నెలకు ఖర్చు రూ.1.20లక్షలు
- ప్రస్తుతం 2వ తరగతి చదువుతోన్న రమ్యప్రియ



రమ్యప్రియకు పాఠం బోధిస్తున్న టీచర్ ప్రసూన

పగిడ్యాల: నంద్యాల జిల్లా ఆంజనేయనగర్ ఏకోపాధ్యాయ పాఠశాలలో రెండవ తరగతి చదువుతోన్న రమ్యప్రియ చదువు బహు ప్రియమైంది. నెలకు సుమారు రూ.1.20 లక్షలు వ్యయం అవుతోంది. 1 నుంచి 2వ తరగతి వరకున్న ఈ పాఠశాలలో ఒకే ఒక్క విద్యార్థినీ రమ్యప్రియ. విద్యార్థిని తల్లిదండ్రులు శ్రీనివాసులు, ఆదిలక్ష్మీలు రెక్కల కష్టంతోనే జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమారుడు మోహిత్‌రంజన్, కుమార్తె రమ్యప్రియ సంతానం. కుమారుడు పగిడ్యాల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 5వ తరగతి చదువుతుండగా.. కుమార్తె మాత్రం స్థానిక ప్రాథమిక పాఠశాలలోనే రెండవ తరగతి చదువుతోంది. ఈ గ్రామ ప్రజలు గుంటూరు జిల్లా నుంచి బతుకుదెరువు కోసం వలస వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. గ్రామంలో మెజార్టీ సామాజిక వర్గం ప్రజలు ఆర్థికంగా స్థితిమంతులు కావడంతో తమ పిల్లలను ప్రయివేట్ పాఠశాలల్లో చదివిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పినా ససేమిరా అంటున్నారు. ఇందుకు ఒక్కడున్న ఒకే ఒక్క విద్యార్థి నిదర్శనం. ఎంఏ బీఈడీ చేసిన ఉపాధ్యాయురాలు ప్రసూన ఒక్క విద్యార్థికి పాఠాలు బోధిస్తూ కాలం గడుపుతున్నారు. అయితే పాఠశాలలో టాయిలెట్లను శుభ్రం చేసేందుకు స్కావెంజర్‌కు నెలకు రూ.6వేలు, మధ్యాహ్నం భోజనం తయారు చేసే వంట మనిషికి హెల్పర్‌గా ఉండే ఆయాకు రూ.3 వేలు కాగా టీచర్ జీతం సుమారు రూ.1.10లక్షలు చెల్లించి ఒక్క విద్యార్థినీ కోసం కష్టపడుతున్నారు. 1, 2 తరగతులు మాత్రమే ఇక్కడ చదివి మళ్లీ 3వ తరగతి వేరే పాఠశాలలో చేరాలి కదా అంటూ గ్రామస్తులు పిల్లలను పంపేందుకు ఆసక్తిని చూపనట్లు తెలుస్తోంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



ఏకోపాధ్యాయ పాఠశాలలో సింగిల్ టీచర్, సింగిల్ స్టూడెంట్ మాత్రమే ఉన్నారు. ఈ నెలాఖరులోగా పిల్లల సంఖ్యను పెంచుకోవాలని, కనీసం 10 మందికి పైగా పిల్లలను చేర్పించుకోవాలని టీచర్‌కు సూచించాం. పరిస్థితి ఇలాగే కొనసాగితే జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదిక పంపుతాం. పిల్లల సంఖ్య పెరగకపోతే ఉన్న ఒక్క విద్యార్థినీని బీరవోలు పాఠశాలలో చేర్పించి టీచర్‌ను డిప్యూటేషన్‌పై లక్ష్మాపురం ప్రాథమికోన్నత పాఠశాలకు పంపుతాం. - సుభాన్, ఎంఈఓ, పగిద్యాల ఆంజనేయనగర్